క్లుప్తంగా

ముమ్మరంగా వాహన తనిఖీలు



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

సాలూరు: పట్టణంలో ఎస్సై నారాయణ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం వాహన తనిఖీలు ముమ్మరంగా చేపట్టారు. సాలూరు మీదుగా రాకపోకలు సాగిస్తున్న వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించి, సక్రమంగా రికార్డులు లేని వారికి అపరాధ రుసుము విధించారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, వాహనరికార్డులు తప్పనిస రిగా కలిగి ఉండాలని స్పష్టం చేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మల్లు నంబూద్రికి నివాళులు



నంబూద్రి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పార్వతీపురం టౌన్: సాయుధ పోరాట యోధు రాలు మల్లు స్వరాజ్యం, మార్క్సిస్టు మహారథి ఈఎంఎస్ నంబూద్రి ఆశయ సాధనకు కృషి చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. ఈ మేరకు నంబూద్రి 25వ వర్ధంతి సందర్భంగా స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఆయన చిత్రపటానికి నివాళులరి ్పంచారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డి శ్రీదేవి, గొర్లి వెంకటరమణ, వి.ఇందిర, ఆర్ లక్ష్మణరావు, జి.కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి



తిరుపతిరావు(ఫైల్)

మక్కువ: మండలంలోని దబ్బగెడ్డ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు బత్తుల తిరుపతిరావు(50) గుండె పోటుతో ఆదివారం మృతిచెందారు. రెండురోజులుగా తిరుపతిరావు ఛాతీలో నొప్పి రావడంతో, విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులు చేర్పించారు. ఈ క్రమంలో వైద్యచికిత్స పొందుతూ ఆదివారం ఆయన కన్నుమూశారు. గ్రామానికి తిరుపతిరావు మృతదేహాన్ని తీసుకురాగా జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు, డీసీసీబీ డైరెక్టర్ మావుడి తిరుపతిరావు, ఎంపీపీ మర్రి పారమ్మలు చేరుకుని, నివాళులు అర్పించారు. అలాగే మండలంలోని పలు పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్ద ఎత్తున గ్రామానికి వచ్చి నివాళులర్పించారు. ప్రతి ఎన్నికల్లో తిరుపతిరావు దబ్బగెడ్డ పంచాయతీకి సంబంధించి, సర్పంచ్, ఎంపీటీసీ అభ్యర్థులను గెలిపించడంలో తిరుపతిరావు ఎంతో కీలక పాత్ర వహించారని మావుడి సోదరులు కొనియాడారు.

గ్రామాల్లో విద్యుద్దీకరణ పనులు

సీతానగరం: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా దెబ్బతిన్న విద్యుత్‌స్తంభాలను మార్పుచేసి లైన్ల మరమ్మతులు చేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఏఈ సోమేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ రెండురోజులుగా ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురవడం వల్ల తోటల్లో చెట్లకొమ్మలు వైర్లపై పడిపోవడంతో సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు. సిబ్బంది సహకారంతో విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరా చేసినట్లు చెప్పారు.

ధ్రువపత్రాల జారీలో జాప్యం

కొమరాడ: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కులధ్రువీకరణ పత్రాల కోసం అందిన దరఖాస్తులు పరిష్కారానికి నోచుకోకుండా పేరుకుపోయాయి. దరఖాస్తులను పరిశీలించి ధ్రువీకరించడంలో సిబ్బంది అలసత్వం వహిస్తుండడంతో మూడు నెలలుగా కులధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం జరుగుతోందని విద్యార్థులు, సంక్షేమ పథకాల లబ్ధిదారులు అంటున్నారు. అధికారులు స్పందించి ధ్రువపత్రాల జారీ త్వరితగతిన అయ్యేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

గుమ్మలక్ష్మీపురం గ్రామస్తుల ఔదార్యం

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలో ఈ నెల 17 నుంచి ఉమా సహిత కైలాసనాథ ఆలయ 40వ వార్షిక మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో వ్యాపారులు చేసుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి చిరువ్యాపారులు ఇక్కడకు వచ్చి టెంట్లు ఏర్పాటు చేసుకున్నారు. అయితే జాతర ప్రారంభం రోజు నుంచి వర్షం కురుస్తుండడంతో రెండు రోజులుగా వ్యాపారాలు జరగలేదు. వారు తెచ్చుకున్న వస్తువులు వర్షానికి తడిచిముద్దయ్యాయి. వ్యాపారం లేక నష్టపోయిన వారికి గ్రామస్తులు అండగా నిలిచి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. సర్పంచ్ బొత్తడ గౌరీశంకరరావు, గ్రామ పెద్దల పిలుపుమేరకు ధన, వస్తు రూపంలో వారికి తోచిన సాయం అందించారు. సుమారు 300 మందికి వసతి, రెండు పూటలా భోజన సదుపాయం కల్పించారు. గ్రామస్తుల ఔదార్యానికి చిరువ్యాపారులు కృతజ్ఞతలు తెలియజేశారు.

రక్తదానం సామాజిక సేవ



రక్తం ఇస్తున్న దాతలు (ఫైల్)

- అవగాహన కల్పిస్తున్న వైద్యులు, స్వచ్ఛంద సంస్థలు
- ముందుకు వస్తున్న దాతలు

పార్వతీపురం టౌన్: ప్రాణాపాయ స్థితిలో ఉండి రక్తం కోసం ఎదురుచూసే వారికి సకాలంలో అవసరమైన గ్రూపు రక్తం అందక మృత్యువాత పడిన భాధాకర పరిస్థితులు అక్కడక్కడా సంభవిస్తున్నాయి. ఆ పరిస్థితిని అధిగమించి నలుగురికి ప్రాణదానం చేయాలన్న సత్‌సంకల్పం ప్రజల్లో వస్తే సానుకూల సమాజ నిర్మాణానికి కారణమవుతారు. ఒకరి రక్తదానం మరొకరికి ప్రాణదానంతో సమానమని భావించి ఈ పవిత్ర కార్యక్రమానికి అందరూ ముందుకు వస్తే శుభపరిణామంగా భావించవచ్చు. దాతలు రక్తదానంపై ఆరోగ్యపరమైన ఇతరత్రా అపోహలను మాని మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేస్తే వారు మరింత చురుగ్గా, దేహదారుఢ్యంతో కొనసాగుతారన్న నగ్న సత్యాన్ని విస్మరించరాదు. ఈ మేరకు స్వచ్ఛంద సేవా సంస్థలు, ప్రభుత్వాస్పత్రి వైద్యులు రక్తదానంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వం కూడా ఆ దిశగా ఒక అడుగు ముందుకు వేసి ప్రచారం విస్తృతం చేసి ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడంతో దాతల సంఖ్యను అమాంతం పెంచడంతో ఫలితాలు ఆశాజనకంగా ఉంటున్నాయి. రక్తం ఇచ్చేటప్పుడు దాతలకు డోనర్ కార్డులు ఇచ్చి వారికి గాని, వారి కుటుంబాలకు గాని ఎప్పుడైనా రక్తం అవసరమైతే ఆ కార్డులను వినియోగంలోకి తీసుకురావచ్చన్న పరిస్థితిని కల్పించడంతో దాతల సంఖ్య పెరుగుతోంది. ప్రత్యేక రోజుల్లో రక్త సేకరణ కార్యక్రమాలను చేపట్టి రక్తాన్ని సేకరించడం, నిల్వచేయడంతో ప్రమాద పరిస్థితుల్లో రోగులకు రక్తం అందజేయ గలుగుతున్నారు.

మూడేళ్ల క్రితం ఐఆర్‌సీఎస్ రక్తనిధి కేంద్రం ఏర్పాటు

పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో మూడేళ్ల క్రితం ఐఆర్‌సీఎస్ రక్తనిధి కేంద్రం ఏర్పాటు చేయగా తరువాత దాన్ని ప్రభుత్వం తమ పరిధిలోకి తీసుకుని రక్తనిధి కేంద్రాన్ని కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలో రక్తనిధి కేంద్రం పూర్తి బాధ్యతలను ఆస్పత్రి వర్గాలు స్వీకరించి రక్తసేకరణపై ప్రత్యేక దృష్టి సారించి అధిక రక్త నిల్వలకు కారణమవుతున్నాయి. గతంలో ఎవరికైనా రక్తం అవసరమైతే రూ.850లు చెల్లించి ఒక యూనిట్ రక్తం ప్యాకెట్‌ను తీసుకోవాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పుడు అలా కాకుండా పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి రక్తం అవసరమైతే ఉచితంగా అందిస్తున్నారు. రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులు, సికిల్‌సెల్ ఎనీమియా, తలసీమియా, డయాలసిస్ పేషెంట్లకు సేకరించిన రక్తం బ్యాగ్‌లు అవసరం పడుతున్నాయి. వారితో పాటు రక్తహీనత రోగులు కూడా ఈ సదుపాయం అక్కరకు వస్తోంది. మరి ఇంతటి అవసరమైన రక్తదానాన్ని ప్రోత్సహించి ప్రజలు, ముఖ్యంగా యువకులు ముందుకు వచ్చి రక్తదానం చేస్తే భవిష్యత్‌లో ఎంతోమందికి సహాయ పడినట్లవుతుందని రక్తనిధి కేంద్రం ఉద్యోగులు పిలుపునిస్తున్నారు.

‘ఒకరి ప్రాణం కాపాడిన తృప్తి



ఇప్పటివరకు 108 సార్లు రక్తదానం చేశాను. రక్తదానం చేయడంలో ఒకరి ప్రాణాన్ని కాపాడమనే తృప్తి ఉంటుంది. రక్తదానం చేయడం వల్ల ఎంతో ఆనందంగా, శరీరం నూతన రక్తంతో ఉల్లాసంగా ఉంటుంది. రక్తదానం చేయడం వల్ల ఎటువంటి ఇబ్బందులు ఉండవు. నేను నా మిత్రులందరికీ రక్తదానం చేయమని సలహా ఇస్తూ ఉంటాను.

– డీవీవీ గుప్తా, వైకేఎం కాలనీ, పార్వతీపురం

95 సార్లు రక్తదానం



రక్తదానం సామాజిక సేవలో భాగంగా భావిస్తూ ఇప్పటివరకు 95 సార్లు చేశాను. మరొకరి ప్రాణపాయ స్థితిలో నా రక్తం అవసరం పడడం ఆనందంగా భావించి ముందుకు వెళ్తున్నా.

– బోటు రామకృష్ణ, రెడ్ క్రాస్ సభ్యుడు

దాతలు అపోహలు వీడాలి



రక్తదాతలు అపోహలను వీడి రక్తదానానికి ముందుకు రావాలి. రక్తదానం మూలంగా ఆరోగ్యంగా మరింత ఉత్సాహంగా ఉంటారు. ఏరియా ఆస్పత్రి పరిధిలో కురుపాం, సాలూరు, బొబ్బిలి పీహెచ్‌సీలలో రక్తనిధి కేంద్రాలను ఏర్పాటు చేసి ఆయా ప్రాంత రోగులకు రక్తనిల్వలు అందుబాటులో ఉండేలా చూస్తున్నాం.

– డాక్టర్ వాగ్దేవి, సూపరింటిండెంట్ జిల్లా ఆసుపత్రి, పార్వతీపురం

మూడు కేంద్రాల్లో ఆధార్ స్పెషల్ డ్రైవ్



అంటిపేటలో సచివాలయం సిబ్బంది, వలటీర్లకు ఆధార్ అనుసంధానంపై వివరిస్తున్న సూపరువైజర్

సీతానగరం: అన్నివిధాలుగా అవసరమైన ఆధార్ నంబర్ పొందడానికి రెండు రోజులు నిర్వహించే స్పెషల్ డ్రైవ్ క్యాంపెయిన్‌ను మండలంలోని ప్రజలు వినియోగించుకోవాలని ఎంపీడీఓ బి.కృష్ణ మహేష్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆధార్‌కార్డు అవసరాల్ని దృష్టిలో ఉంచుకుని సమస్య పరిష్కరించడానికి అంటిపేట, జోగింపేట, బూర్జ సచివాలయాల్లో సోమ, మంగళవారాలు(రెండు రోజులు) పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలో డిజిటల్ సహాయకులు స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే కార్డులు లేనివారికి కొత్తగా ఆధార్ కార్డులు మంజూరుచేయనున్నట్లు తెలిపారు. జోగింపేట, అంటిపేట, బూర్జ గ్రామాలకు సమీపంలో ఉన్న గ్రామాల వారు నిర్దేశించిన ఆధార్ కేంద్రాలకు వెళ్తే వారి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని తెలిపారు. అలాగే గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్ల సహకారంతో ఆధార్ సమస్య పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంటిపేట, జోగింపేట, బూర్జ పంచాయతీ కార్యదర్శులు శశిభూషణ్‌రావు, పి.శ్రీనివాసరావు, టి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఛాత్రాలయంలో ప్రవేశాలకు అర్జీల స్వీకరణ

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేటలో గల ఎయిమ్ ఫర్ సేవా ఛాత్రాలయంలో విద్యార్థుల ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని మేనేజర్ ఎన్. సురేష్‌కుమార్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ ఛాత్రాలయ (అనాథాశ్రమం) అభివృద్ధి కమిటీ ప్రతినిధుల సూచనల మేరకు 2023–24 విద్యాసంవత్సరానికి గాను ప్రవేశాలు కల్పించాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఛాత్రాలయంలో విద్యార్థులకు విద్యతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించడానికి యాజమాన్యం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. ఉచిత విద్య, ఉచిత వసతి కల్పిస్తామన్నారు. తలిదండ్రులు లేని పేదింటి పిల్లలకు ప్రాధాన్యం ఉంటుందని, రెండవ ప్రాధాన్యతగా తల్లి లేదా తండ్రిలో ఎవరైనా ఒకరు లేని వారికి ఉంటుందన్నారు. 3వ తరగతి నుంచి 10 వరకూ చదివిస్తారని, 10 పాసైన విద్యార్థులను ఉన్నత చదువుల కోసం ఏపీలో ఉన్న 12 ఛాత్రాలయాలలో ఏదైనా ఒక చోటకు పంపిస్తామని తెలిపారు. అర్హులైన విద్యార్థుల సంరక్షకుల నుంచి ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వివరించారు.

పంటల పరిశీలన



మరిపల్లిలో నేలరాలిన మొక్కజొన్న పంటలను పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ అనంతకుమారి

సాలూరు: తుఫాన్ కారణంగా వీచిన ఈదురుగాలులతో నష్టపోయిన పంటలను ఏఎంసీ చైర్‌పర్సన్ దండి అనంతకుమారి ఆదివారం పరిశీలించారు. ఈ మేరకు మండలంలోని తోణాం, మామిడిపల్లి, కందులపథం, మరిపల్లి, కురుకూటితదితర ప్రాంతాల్లో పర్యటించి నేలరాలిన అరటి, మొక్కజొన్న పంటలను చేశారు. ఈ సందర్భంగా బాధిత రైతులతో ఆమె మాట్లాడుతూ, రైతులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ విషయాన్ని ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర దృష్టికి తీసుకువెళ్లి రైతులను ఆదుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టపరిహార వివరాల నివేదికను ప్రభుత్వానికి ఇవ్వాలని సూచించారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ నాయకుడు దండి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలి



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై కె.నీలకంఠం

సీతానగరం: మండలంలోని రాష్ట్ర రహదారిపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనచోదకులు సహకరించాలని ఎస్సై కె.నీలకంఠం కోరారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర రహదారిలోని హనుమాన్ జంక్షన్ వద్ద సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న కారణంగా వాహనాలను తనిఖీ చేసి జాగ్రత్తలను పాటించాలని కోరుతున్నామన్నారు. అలాగే మితిమీరిన జోరుగా వాహనాలు తిరుగాడుతున్న కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తించి వాహనాలను తనిఖీ చేస్తున్నామన్నారు. ద్విచక్రవాహన చోదకులు నిబంధనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి ఆక్రమణపై చర్యలు



ఆక్రమణకు గురైన చేపల మార్కెట్‌ను తొలగించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్...

పార్వతీపురంటౌన్: పట్టణ ప్రధాన రహదారిపై ఆక్రమణలు చేపట్టి వ్యాపారాలు సాగిస్తున్న వారిపై పోలీసులు చర్యలు చేపట్టారు. ఈనెల 17వ తేదీన ‘‘సాక్షి’’ దినపత్రికలో రహదారులపై వ్యాపారం అనే కథనానికి స్పందించి ఆదివారం రహదారిపై ఆక్రమణలను తొలగించారు. పట్టణ ప్రధాన రహదారి పక్కన అనధికారికంగా నిర్వహిస్తున్న చేపల మార్కెట్‌ను తొలగించారు. అలాగే రానున్న రోజుల్లో ఆక్రమణలు చేపట్టిన వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

కోటదుర్గమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు



అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

వీరఘట్టం: మముగన్న మాఅమ్మ.. దుర్గమ్మా పాహిమాం.. అంటూ భక్తులు కోటదుర్గమ్మకు పూజలు చేశారు. వీరఘట్టంలో నూతనంగా ప్రతిష్ఠించిన కోటదుర్గమ్మతల్లి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఉదయం 4 గంటల నుంచి ఆలయానికి చేరుకుని అమ్మను దర్శించుకున్నారు. యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్ శర్మయాజీ నేతృత్వంలో ప్రత్యేక పూజలు చేశారు. జోరున కురుస్తున్న వర్షాన్ని కూడా లెక్క చేయకుండా అమ్మవారి దర్శనానికి బారులుతీరారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా డీఎస్పీ జీవీ కృష్ణారావు ఆదేశాల మేరకు పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నాగళ్ల తయారీలో బిజీ



నాగళ్లు తయారు చేస్తున్న విశ్వబ్రహ్మణులు

గరుగుబిల్లి: తెలుగు సంవత్సరాది ఉగాదికి కొత్తనాగళ్లను తయారీచేసే పనిలో విశ్వబ్రహ్మణులు బిజీబిజీగా ఉన్నారు. ఉగాది నాడు రైతులు కొత్త నాగళ్లతో ఏరుపూయడం ఆనవాయితీ. తెలుగువారి సంప్రదాయాలకు అనుగుణంగా వడ్రంగులు నాగళ్లను తయారు చేసి రైతులకు విక్రయిస్తున్నారు. మండలంలోని గరుగుబిల్లి, చినగుడబ, వల్లరగుడబ, పెద్దూరు, లఖనాపురం తదితర గ్రామాల్లో కొత్తనాగళ్లను తయారుచేసే పనిలో వడ్రంగులు నిమగ్నమయ్యారు. గతంలో కంటే ఈ ఏడాది నాగళ్ల ధరలు కూడా పెరిగాయి. గతంలో రూ.500 ఉన్న నాగళి, ఈ ఏడాది రూ.600 నుంచి రూ.900ల వరకు ధర పలుకుతోందని రైతులు అంటున్నారు. కాగా, ఈ నెల 22న ఏరుపూతకు రైతులు సిద్ధమవుతున్నారు.

హై సెక్యూరిటీ జోన్లుగా టెన్త్ పరీక్ష కేంద్రాలు



మాట్లాడుతున్న డీఈవో లింగేశ్వరరెడ్డి

- విద్యార్థులను తనిఖీ చేశాకే పరీక్ష హాలులోకి
- మాల్ ప్రాక్టీసుకు పాల్పడిన, ప్రోత్సహించిన వారిపై కఠిన చర్యలు
- డీఈవో లింగేశ్వరరెడ్డి

రామభద్రపురం: వచ్చే నెల 3వ తేదీ నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు జరగనున్నందున పరీక్ష కేంద్రాలను హై సెక్యూరిటీ జోన్లుగా మార్చనున్నామని డీఈవో లింగేశ్వరరెడ్డి తెలిపారు. విద్యార్థులకు రాగి జావ అందించే కార్యక్రమాన్ని ఈ నెల 21వ తేదీన స్థానిక ఉన్నత పాఠశాలలో లాంఛనంగా ప్రారంభించనున్నందున ఆ ఏర్పాట్లు పరిశీలించేందుకు డిప్యూటీ డీఈవో తిరుపతిరాయుడుతో కలిసి ఆదివారం ఆయన వచ్చారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎగ్జామ్ ఏక్ట్ 25 ప్రకారం పరీక్షల నిర్వహణలో ఎవరైనా నిర్లక్ష్యం వహించినా, పేపర్ లీకేజీ, మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడిన, సహకరించిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు ఇచ్చే ప్రశ్నపత్రంపై ఏడు అంకెలతో కూడిన ప్రత్యేక కోడ్ ముద్రించారని, ఏదైనా కేంద్రం నుంచి ప్రశ్నపత్రం లీక్ అయితే అది ఎక్కడ జరిగిందో గుర్తించే విధానాన్ని విద్యాశాఖ అమల్లోకి తీసుకువచ్చిందన్నారు.

144 సెక్షన్ అమలు

ఎన్నికల మాదిరిగా పరీక్షల నిర్వహణలోనూ స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ పాటించాలని స్పష్టంచేశారు. ప్రతి కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నామని తెలిపారు. డ్యూటీ పాస్ లేకుండా పరీక్ష కేంద్రంలోకి ఎవరినీ అనుమతించరాదన్నారు. పరీక్ష కేంద్రంలోకి స్మార్ట్ వాచీలు,సెల్‌ఫోన్లు,ఇతర ఏవిధమైన ఎలక్ట్రానిక్ వస్తువులను ఎట్టిపరిస్థితులలోను తీసుకెళ్లకుండా కట్టదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. డీవోలు, ఇన్విజిలేటర్లతో పాటు చీఫ్ సూపరింటెండెంట్ల వద్ద కూడా సెల్‌ఫోన్లు అనుమతించరాదని కోరారు. నో సెల్‌ఫోన్ జోన్ విధానాన్ని అనుసరించాలని, విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేశాకే పరీక్ష హాలులోకి పంపాలని చెప్పారు. విద్యార్థులకు రోల్ నంబర్ ఆధారంగా సీటింగ్ అరేంజ్‌మెంట్లతో పాటు ఓఎంఆర్ షీట్, ప్రశ్నపత్రాలను పంపిణీ చేయనున్నామని చెప్పారు.

సీసీ కెమెకరాల నిఘాలో

ప్రతి విద్యార్థికి 24 పేజీలతో కూడిన ఆన్సర్ బుక్‌లెట్‌ను ఇవ్వనున్నామని, అదనంగా అవసరమైతే 12 పేజీల బుక్‌లెట్‌ను ఇస్తారన్నారు. విద్యార్థులకు ఇచ్చిన ఓఎంఆర్ షీట్, ఆన్సర్ బుక్‌లెట్‌లలో ఏ ఒక్క పేజీని చింపినా మాల్ ప్రాక్టీస్ కింద పరిగణించి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఆటంకాలు ఉన్న ప్రాంతాలలోని పరీక్ష కేంద్రాలను గుర్తించి అవసరమైతే సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యార్థులు హాల్‌టికెట్‌తో వచ్చి ప్రశాంతంగా పరీక్ష రాసి వెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో తిరుపతినాయుడు, జిల్లా పరీక్షల విభాగం కార్యదర్శి సన్యాసిరాజు, హెచ్ కె కామేశ్వరరావు పాల్గొన్నారు.

అకాల వర్షం.. అన్నదాతకు నష్టం

- వందలాది ఎకరాల్లో పంటలు ధ్వంసం
- పరిహారం అందించి ఆదుకోవాలంటున్న రైతులు



గరుగుబిల్లి: కొత్తపల్లిలో నేలమట్టమైన అరటితోట



వీరఘట్టం: కంబరవలసలో ఈదురుగాలులకు ధ్వంసమైన అరటితోటలను పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

వీరఘట్టం: అకాల వర్షాలు.. రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. ఈదురుగాలులకు పలు ప్రాంతాల్లో మొక్కజొన్న, నువ్వు, అరటి, మామిడి, జీడి తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. వీరఘట్టం మండలంలో దశుమంతపురం, కంబరవలస, చిట్టపులివలస, కంబర, నడిమికెల్ల, విక్రమపురం, నడుకూరు, వీరఘట్టం గ్రామాల్లో సుమారు 100 ఎకరాల్లో అరటి తోటలు, 50 ఎకరాల్లో మొక్కజొన్న, మామిడి పంటలు ధ్వంసం అయ్యాయి. సుమారు రూ.50 లక్షల వరకు నష్టం జరిగి ఉంటుందని వ్యవసాయ, రెవెన్యూ శాఖల సిబ్బంది ప్రాథమికంగా అంచనావేశారు. క్షేత్రస్థాయిలో పంటనష్టాన్ని పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు. మరోవైపు నియోజకవర్గంలో పంట నష్టాలపై ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అధికారులను ఆరా తీశారు. పంటలను పరిశీలించి నష్టాన్ని అంచనా వేసి, ఆ మేరకు రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

గరుగుబిల్లి: మండలంలో శనివారం సాయంత్రం వీచిన ఈదురుగాలులకు, భారీ వర్షానికి కొత్తపల్లి, పెద్దూరు తదితర గ్రామాల్లో అరటి, మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. ఆయా గ్రామాల్లో సుమారు 50 ఎకరాల అరటి, 70 ఎకరాల్లో మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లింది. వేలాది రూపాయలు మదుపు పెట్టి సాగు చేస్తున్న పంటలు అకాల వర్షాలకు నేలమట్టం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు పంటనష్టాలను పరిశీలించి తమకు పరిహారం అందించాలని బాధితులు కోరుతున్నారు.



వీరఘట్టం: చిట్టపుడివలసలో ధ్వంసమైన అరటితోట

సీతంపేట: మండలంలో కురిసిన అకాల వర్షాల కారణంగా కడగండి, కొత్తగూడ, గొయిది, ఈతమానుగూడ, దోనుబాయి, పొల్ల, మత్రిపాడు, పూతికవలస తదితర ప్రాంతాల్లో జీడి, మామిడి, అరటి పంటలకు తీవ్రనష్టం జరిగిందని రైతులు వాపోతున్నారు. అరటి తోటలు నేలకొరిగాయి. జీడి, మామిడి పిందెలు రాలిపోవడంతో రైతులు నష్టపోయారు.

భామిని: మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారు. పసుకుడి, బిల్లుమడ, గురండి, నేరడి–బి తదితర గ్రామాల్లో జొన్నపంట నేలకొరిగింది. కీసర, కోసలి, ఘనసర గ్రామాల్లో సాగులో ఉన్న పుచ్చకాయ పాదులు నీటమునిగి బురదలో కూరుకుపోయాయి. సతివాడ, కొత్త ఘనసర, అత్తికొత్తూరు, దిమ్మిడిజోల, లివిరి, పసుకుడి, గురండిలలో సాగు చేస్తున్న కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. ఈదురుగాలులకు మనుమకొండ, వడ్డంగి, మూలగూడ, బొమ్మిక గ్రామాల పరిధిలో జీడితోటలు ధ్వంసం అయ్యాయి. పలుచోట్ల ఇటుకల బట్టీల్లో ఆరబెట్టిన ఇటుకలు తడిచిపోవడంతో బట్టీ యజమానులు నష్టపోయారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

అల్పపీడన ద్రోణి ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో అత్యవసర కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని తహసీల్దార్ నీలాపు అప్పారావు తెలిపారు. 24 గంటలు అందుబాటులో ఉండేలా సిబ్బందికి షిఫ్ట్ విధానంలో విధులు కేటాయించామన్నారు. ప్రజలు అత్యవసర సహాయార్థం కంట్రోల్ రూమ్ 7702805978 నంబరులో సంప్రదించాలని సూచించారు.

తగ్గుముఖం పట్టిన వర్షం

పాలకొండ: తుపాను కారణంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు ఆదివారం మధ్యాహ్నానికి తగ్గుముఖం పట్టాయి. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. వర్షంతో పాటు ఈదురుగాలులు వీయడంతో పలుచోట్ల చెట్లు కొమ్మలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. వాతావరణం చల్లగా మారింది. నువ్వు పంటకు ఈ వర్షం అనుకూలంగా ఉంటుందని ఏఓ వాహిని తెలిపారు.

కొమరాడ: మండలంలోని విక్రంపురం, సివిని, ఆర్తాం, పరుశురాంపురం తదితర గ్రామల్లో సాగు చేస్తున్న నువ్వుపంట వర్షాలకు నేలమట్టమైంది. వ్యవసాయాధికారులు పంటనష్టాన్ని పరిశీలించి బాధిత రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు కళింగి మల్లేశ్వరరావు కోరారు.